శ్రీరస్తు.

# నానారాజన్యచరిత్రము.

ఇది

మచిలీపట్టణస్థ నోబిల్ కళాశాలాంధ్రోపాధ్యాయులును,
చంద్రకాంత, జపానీయము, మార్కండేయవిలాసము,
వాసంతిక, ప్రియదర్శిక, కృష్ణరాయల కొండవీటివిజయము
మున్నగు గ్రంథములకు కర్తలును

నగు

శ్రీరామ్ వీరబ్రహ్మము గారిచే


రచియింపఁబడి

శ్రీ వేంకటగిరి సంస్థానాధీశ్వరు లగు
శ్రీ రాజా వెలుగోటి గోవిందకృష్ణయాచేంద్ర బహాదరువారి
యంకితముగఁ

ప్రకటింపఁబడియె.

**1918.**

*Copy right reserved.*] [PRICE Rs. 3



గ్రంథకర్త:
శ్రీరామ్ వీరబ్రహ్మము, మచిలీపట్నము.

# Nana Rajanya Charitramu

Dedicated

Most Respectfully

To

SRI SRI SRI RAJAH VELUGOTI
GOVINDA KRISHNA YACHENDRA
BAHADAR GARU
RAJAH OF VENKATAGIRI

With Kind Permission

BY

THE AUTHOR.



శ్రీ రాజా మోతే గంగరాజుగారు,
ఏలూరు.

శ్రీరస్తు.


# విసన్నపేటసంస్థానము.

(ఏలూరు - కృష్ణాజిల్లా.)

సీ॥ శ్రీరమాలోలపా♦దారవిందద్వంద్వ
పూజనాసక్తిప్ర♦పూర్ణమతులు
భూరిక్షుధార్తిప్ర♦జారక్షణీయస
ద్యంత్రాలయస్థాప♦నాభిరతులు
నానాదిశాగంతు♦కానీకవిశ్రాంత
సత్రసంస్థాపన♦సచ్చరితులు
ఆంజనేయాదిదే♦వాలయోచ్చయపరి
ష్కృతనిశ్చయైకప్ర♦కీర్తియుతులు

తే. గీ. మోతెవంశాబ్ధిపూర్ణ సో♦ములునునైన
వేంకయాభిఖ్య గంగరా♦డ్విబుధసఖ్య
వారిసంతతి నిష్టదై♦వంబు శ్రీమ
దాంజనేయుండు ప్రోచుం జి♦రాయువొసంగి.

విస్సన్నపేటసంస్థానము ప్రప్రథమమున వరిగొండవంశజు లైన విప్రవర్యులచేం బాలింపంబడెను. వీరిలోం బ్రథము లగు వరిగొండ నీలంరాజుగారు తత్కాలమునం బ్రభువులుగా నుండిన మహమ్మదీయుల యొద్ద జమలవాయి పరగణాను దేశపాండియుద్యోగమున నుండెను. ఈ దేశపాండియుద్యోగము బహుశః యిప్పటి తహశిల్ దారుద్యోగము వంటి దగును. ఇటుల దేశపాండియుద్యోగమునుండి జమీందారుల





చ్చియు శ్రీజనార్దనస్వామియాలయమును నిర్మాణము చేయించిరి. ఏలాగునంగు వీరు గొప్పధనవంతులుగను గొప్పవర్తకులుగను నుండుట చేతనేగాక నీగ్రామమందు వీరు పూనుకొని చేయుచున్న ధర్మకార్యములచేతను వైశ్యబృందమేగాక యితరపురప్రముఖులును వీరియం దత్యంతగౌరవము గలిగి యుందురు.

వీరిలో దాదాపుగఁ బదిసంవత్సరము లప్పన్నగారు పురపారిశుధ్యసంఘమున సభ్యులుగ నుండిరి. వేంకటస్వామిగారును నెడతెగక ముప్పదిసంవత్సరములు పురపారిశుధ్యసంఘసభ్యులుగను హానరరీ మేజస్ట్రీటుగను దాలూకా బోర్డు మెంబరుగను నుండి వీరు ప్రజల కనేకోపకారంబులఁ గలిగించి యుండిరి.

ఈ ముప్వురుసోదరుల యనంతరమున వీరిసంతతి వారైకమత్యమును గలిగి పరస్పరానురాగముతోఁ దమ జమీయొక్కస్థితిగతులను విచారించుకొనుచుఁ దమ యెస్టేటులోని ప్రజలకు సౌఖ్యకరముగను దమకు లాభకారియగునటులను బాలించుకొనుచుండిరి. ఒక జమీపాలనవిషయములోనేకాక వ్యాపారమునందును ధనాభివృద్ధి గాంచఁ గలిగి యీజిల్లాలో మిక్కిలి ధనవంతు లనిపించుకొనిరి. మఱియు నెర్నగూడెముతాలూకాలోఁ జేరి దంతులూరి పెదవేంకటజగన్నాథరాజుగారిదైన గుండేపల్లి యెస్టేటును నేలూరు సబార్డినేటుకోర్టు వారివేలములో వీరిచేఁ గొనఁబడెను. అందు గుండేపల్లి, క్రొత్తచోడవరము, ప్రాఁతచోడవరముయొక్క తూర్పుపాయ యనుగ్రామములు గలవు. ఈగ్రామములం దత్యంతశిథిలస్థితిలో నున్న నెట్టి కాలువసంబాధ మగు నీటివసతునకు దాదాపుగఁ బదివేలరూప్యముల వెచ్చించి స్థిరమైనమరమ్మతును జేయించిరి. ఇందువలన రైతులకును విశేషలాభకారి యగుటచే నాగ్రామస్థులు వీరియం దత్యంత భక్తిశ్రద్ధలతో గౌరవమును జూపుచుందురు. వీరు దొరతనము వారికి కాదాయపుంబన్ను (ఇన్కంటాక్సు) గఁ బదివేలును, జమీలపేష్కష్ క్రింద నైనువేలును, నితరభూములు మున్నగు వానికి రెవెన్యూశిస్తులక్రింద నాలుగువేలును బ్రతిసంవత్సరమును జెల్లింపుచుందరు.

ఈకుటుంబమువారు దమతండ్రిగార్లచే నెలకొల్పఁబడిన ధర్మకార్యములను వృద్ధిపఱచుచు నింక ననేక నూతనధర్మకార్యములను గావించుచు మిగుల ఖ్యాతిని బడయుచున్నారు. వీరితండ్రిగార్ల కాలములో నిర్మింపఁబడిన జనార్దనాలయమును వర్తకసమూహము వారిచే ననేకము లైనకట్టడముల నేర్పాటుచేయించి యందువల్ల ధనమును వృద్ధిపఱచి దివ్యస్థల మగునటుల లక్షలకొలఁది వెచ్చించి యనేకాలయములను నిర్మింపఁ జేసిరి. అందు శ్రీజనార్దన శ్రీరంగనాయకస్వామివార్ల ప్రతిష్ఠలను జేయించిరి. మఱియు నిత్యనైవేద్యభోగకైంకర్యాద్యుత్సవము లత్యంత వైభవముగ జరుగునటుల స్థిర మైన భూవసతుల నేర్పఱచిరి. ఈయాలయములకును శ్రీకన్యకాపరమేశ్వరీ నగరేశ్వర దేవాలయములకును ధర్మసత్ర నిరతాన్నదానసత్రాదులకును నీకుటుంబమువారే ధర్మకర్తలుగ నుండి వ్యవహరించుచు మంచి స్థితిలో నుంచిరి. ఇటుల దైవభక్తిపరాయణు లై తమ భక్తిశ్రద్ధలను జూపుటయ కాక శ్రీజనార్దనాలయమునందు శ్రీయాంజనేయదేవాలయ మొకటి నిర్మించి, యందు బహుసుందర మైన పాలరాతివిగ్రహమును బ్రతిష్ఠించి నిత్యనైవేద్యదీపారాధనాద్యుత్సవములను వీరు సొంతముగ జరిగించుచు శ్రీయాంజనేయస్వామిని దమయిష్టదైవంబుగాఁ బూజించుచుందురు.

స్వలాభమునకై వీరిచేఁ గావింపఁబడుచున్న వ్యాపారబాహుళ్యమును బరోపకారముగనే పరిణమించుచుండెను. ఎట్లన నేలూరుపురమునఁ బ్రప్రథమమున నుప్పుడుబియ్యము జేయు నొక యంత్రశాల (రైసుమిల్లు) ను రెండులక్షలధనమును వెచ్చించి నిర్మాణము సేసిరి. ఇందు బ్రతిదినమును బదివందల బియ్యపుబస్తాలు దయారు చేయఁబడును. దీన వందలకొలఁది కూలిజనమునకు జీవనోపాధి గలిగెను. వీరికిని నెక్కుడు ధనాదాయమును గూర్చెను. ఈ గ్రామమునకే డెనిమిదిమైళ్లదూరమునఁ గొల్లేరను సరస్సు గలదు. అది యేలూరు గుడివాడ కయికలూరు తాలూకాల పల్లపుగ్రామముల నంటి, ముప్పదిరెండుమైళ్ల పొడవును బండ్రెండుమైళ్ల వెడల్పును



గలిగిన పల్లపుమురుగుప్రదేశ మై యుండెను. కృష్ణాగోదావరీనదుల నుండి వచ్చెడిమురుగునీ రీప్రదేశమున నిలిచి సముద్రమునఁ గలియుచుండును. ఈజలమయప్రదేశమం దక్కడక్కడ కొన్నిలంక లేర్పడి విస్తీర్ణము గలిగి యున్నవి. మఱికతావులయందుఁ జిన్నిచిన్నిగుడిసెలు గల కొన్నిగ్రామములును గలవు. ఈగ్రామస్థులు లంకలయందు నీటి నేతాములలోఁ దోడుకొని కొద్దిగా సాగుచేసి జీవించుచుందురు. దీని నీకుటుంబమువారు గనిపెట్టి ప్రథమమునఁ గైకలూరుతాలూకాలోని గుడివాకలంకగ్రామముతాలూకు పదివందల యెకరముల భూమిని దొరతనమువారివలనఁ గౌలునకుఁ బుచ్చుకొని యందు మిగుల ధనమును వెచ్చించి నీరు తోడు మంచిసామర్థ్యముగల గొప్పయింజను దెప్పించి దానిసాహాయ్యమున సాగు చేయించుచుండిరి. ఇందువలనఁ బంటలు విశేషముగఁ బండి రైతులకును దదితరప్రజకును మహోపకారము గలిగెను. కొల్లేటిసరస్సులోని మొదటియింజ నిదియ. పిమ్మట మఱి రెంటిని దెప్పించి సాగు సేయించుచుండిరి. వీరిమార్గము ననుసరించి మఱికొందఱు కొన్నియింజనులను బెట్టించిరి కాని వానియన్నిఁటిలో నివియ గొప్పవి యై దినమునకు నూఱెకరములనుసైతము దడుపుచుండెను. ఇందువలనఁ బ్రజలకు మహోపకారమును దమ కాదాయవృద్ధియుఁ గలిగెను. ఇట్టిదియె మఱియొకటి గలదు. అ దేదన వీరి ప్రోత్సాహముచే నేలూరున నెలకొల్పఁబడిన ప్రత్తిజనపనారల యంత్రశాల (Kistna Jute & Cotton Mills) స్వలాభకారి యగుటయ కాక పరజనోపకారియు నై విరాజిల్లుచుండెను. ఎట్లన నీయంత్రశాలయం దనవరతమును బదునైదువందల స్త్రీపురుషాదు లైన కూలిజనమునకుఁ బని గలిగి వారి జీవనమున కాధారముగ నున్నది. ఈ యంత్రశాలాస్థాపనార్థ మై వీరు భాగస్వాములుగ నుండి యొసంగిన యేబదివేలరూప్యములుగాక స్వల్పపువడ్డీతో మూఁడునాలుగులక్షల ద్రవ్యమును ఋణ మొసంగిరి. ఆ బదులు మొత్తము తీర్మానింపఁబడి ప్రస్తుత మిది పదిపంద్రెండులక్షలవఱకు వృద్ధి గావింపఁబడెను. ఇందు గోఁగునారను బదును జేయుట, దారములను వడకుట, గోతాలు

నేయుట మొదలైనపనులు గావింపఁబడు చుండును. విద్యుద్దీపికాళి తోడను, యంత్రవిశేషములతోడను, నీ శాలయంతయు నేత్రపర్వమై కనిపించును. ఈయంత్రశాలను స్థాపించువిషయమునను నింతవఱకు మంచి యున్నతస్థితికి దెచ్చువిషయమునను మోతే గంగరాజుగారు, మిగుల శ్రమ సేసిరి. ప్రారంభములోఁ గొందఱు నూఱురూప్యములు వెలగల తమభాగములను నేబదిరూప్యములకే యమ్ముకొనఁ జూచిరి; కాని యిప్పు డిన్నూఱేబదిరూప్యము లిచ్చినను భాగము నమ్ముకొను వారు లేరైరి. ఇప్పుడు భాగస్వాముల కత్యంతలాభకారిగ నుండెను. ఇది యంతయు గంగరాజుగారి కార్యకౌశల్య మని భాగస్వాములెల్లరును గొనియాడు చున్నారు. ఈ కంపెనికి బ్రథమమునుండియు గంగరాజుగారే కార్యదర్శకులుగను ధనాగారాధిపతులుగను నుండి వ్యవహరించు చుండిరి.

ఈ కుటుంబమువారు మొదటినుండియు ధర్మపరాయణులై 'యద్దదాతి యదశ్నాతి తథైవ ధనినాంధన' మనువాక్యార్థ మెఱింగి పెక్కు ధర్మకార్యము లొనరించు చున్నారు. వానిలోఁ గొన్నిఁటి మాత్ర మీదిగువ నుదహరించెదను. తమ నివాసస్థాన మైన యేలూరులో నొకవిశాలప్రదేశమం దిరువదియైదువేలరూప్యముల వ్యయముతో నొక గొప్పసత్రమును నిర్మింపఁ జేసిరి. ఇందు బాటసారు లనేకులు దమకుటుంబములతో నివసించుటకు విశాలములైన గదులు గల సత్రశాలయును, గౌరవనీయులు నివసించుటకుఁ దగిన విశాల సౌధమును, నొక నిరతాన్నసత్రమును నిర్మాణము సేయించిరి. ఇందు దిగువారికి పాకపాత్రలు మొదలగునవియు నీయఁబడును. మఱియు నిం దనేకపరికరముల నేర్పఱచి యీధర్మసత్ర మవిచ్ఛిన్నముగా జరుగుటకుఁ గొంతమూలధనము నుంచిరి. ఇది బాటసారుల కత్యంత సౌఖ్యదాయకముగ నుండెను.

వీరికి బ్రాహ్మణభక్తి మెండు. కాశీక్షేత్ర మందు బ్రాహ్మణులకు రాత్రిభోజనము దొరుకు టరు దని యం దొకయన్నసత్ర ముంచి పదునెనిమిదిసంవత్సరములనుండి పోషించు చుండిరి. ఏలూరుపురమున



సర్వజనోపయోగార్థమును బశువులకొఱకును మంచినీటివసతిగల యొక తటాకమును ద్రవ్వించిరి. అచ్చట నొకముసాఫుఖానాయును నొక విశ్రాంతిశాలయును నెలకొల్పఁబడెను. అల్లే కొల్లేటిసరస్సు మధ్య నున్న యనేకగ్రామప్రజలకు వేసవికాలమందు మంచినీటివసతి లేమిఁ గనిపెట్టి యం దైదాఱువేలరూప్యములవ్యయముతో నొక గొప్పతటాకమును ద్రవ్వించి పశుకోటికిని బ్రజాసమూహమునకును మహోపకారమును గావించిరి. ఒకబ్రాహ్మణుఁడు గృహమునకై యాచింపఁగ నాలుగువేలరూప్యముల వెచ్చించి యొకనూతనగృహమును నిర్మింపఁజేసి సమస్తపరికరములతో దాన మొసంగిరి. ఇంక బ్రాహ్మణు లనేకులకు భూదానాదు లొసంగి స్థిరజీవనోపాధి కలుగఁ జేసిరి. తదితరులకును వివాహగృహనిర్మాణాదుల కని వచ్చి యాశ్రయింపఁగఁ దగురీతి సాయ మొనరించు చుండిరి.

బందరులోని జాతీయకళాశాలకు బదునాలుగువందలరూప్యము లొసంగిరి. ఏలూరులో ఘోషా ఆసుపత్రి (స్త్రీలకొఱకై ధర్మవైద్యశాల) గట్టించు నెడల నిరువది వేల రూప్యముల విరాళ మొసంగెద మని వాగ్దాన మొనరించిరి, కాని దొరతనమువా రీయుద్యమమును బ్రస్తుతఘోరసంగ్రామకారణమున నింకను బ్రారంభింప రైరి.

వీరి యౌదార్యములలోఁ బ్రశంసనీయ మగు మఱియొకవిషయము గలదు. పదిపండ్రెండు సంవత్సరములనుండి ప్రతిదినమును బగలు మూఁడుగంటలవఱకు గూలినాలి చేసికొను బీదజనమునకును గుంటి గ్రుడ్డి మొదలగువారికిని నూకలజావను గాయించి పోయించుచు నిందుకొఱకై తగిన శాశ్వతపునౌకర్లను బరికరములను స్థలమును నేర్పఱచి ప్రతిదినమును నసంఖ్యాకు లగు బీదల క్షుదార్తిని బోఁగొట్టు చుండిరి.

ఏలూరులో వీరిచే నేర్పఱపఁబడిన తోఁట యొకటి మిగుల రామణీయకము గలిగి నానావిధఫలపుష్పభరితంబు లైన వృక్షరాజంబులచే నేత్రపర్వమై యుండును.

ఇట్లు సర్వజనోపయోగకార్యములేగాక విద్యావిషయమునం

డును నీ రెక్కుడుధనమును వెచ్చింపుచున్నారు. బెజవాడలోని శ్రీకన్యకాపరమేశ్వరీహైస్కూలున కొకసహస్రరూప్యము లొసంగిరి. ఏలూరులోని దొరతనమువారి బాలికాపాఠశాలకు నెలకుఁ బది రూప్యముల వేతనముచొప్పున నొకసంగీతబోధకుని నేర్పఱచి యిప్పటికి మూఁడునాలుగుసంవత్సరములనుండి బాలికలకు సంగీతవిద్య గఱపించుటయ కాక యిట్లే చిరకాలము జరుగున ట్లేర్పాటు సేయ నుండిరి. "సైగన్ అహమ్మద్ మిమోరియల్ ప్రెసిడెన్సి చాంపియన్‌షిప్పు టూర్నమెంటు" నకు సంబంధించిన టెన్నిసునకు 'షీల్డు' అను నొకరజితమయచిహ్నము నొసంగిరి. ఏలూరులోని "హిందూయువజనసభ" యను పుస్తకభాండాగారమున కేనూఱురూప్యములు వెలగలగ్రంథము లొసంగిరి. ఆర్యవైశ్యవిద్యానిధికి పదివేలరూప్యములను ధారాళముగ నొసంగి తమయౌదార్యమును వెల్లడించిరి. రాజభక్తియందును వీరు వెనుదీయనివారై ప్రస్తుతయుద్ధనిధికై పదునైదువేలఋణము (War-Loan) నొసంగిరి. తా మొసంగుటయకాక పౌరులచేఁ బెద్దమొత్తము నిప్పించుటలో వీరు చూపినశ్రద్ధకు దొరతనమువారు సంతసించి యొక యోగ్యతాపత్రిక (Certificate) నొసంగిరి. ఇట్లే వీరు శ్రీ జార్జిచక్రవర్తిగారి పట్టాభిషేకసందర్భమునందు ఢిల్లీకి వెళ్ళి దొరతనమువారిచే యోగ్యతాపత్రికల నంది యుండిరి.

కుటుంబజ్యేష్ఠు లైన వెంకన్నగారు పది పండ్రెండు సంవత్సరములనుండి యేలూరుపురపారిశుద్ధ్యసంఘసభ్యులుగా నుండి పురజనుల కెన్నియో సదుపాయములఁ జేయు చుండిరి. గంగరాజుగా రెక్కుడు ప్రసిద్ధిని గాంచి బెజవాడలోని శ్రీకన్యకాపరమేశ్వరీహైస్కూలున కధ్యక్షులుగను, నేలూరుపురయువజనపుస్తకభాండాగారమునకును నన్నదానసమాజమునకును గోసంరక్షణసభకును ధర్మకర్తలుగను, బళ్ళారిలో జరిగిన యార్యవైశ్యమహాజనసభకు నధ్యక్షులుగను నుండిరి. మఱియు నీ గంగరాజుగారు డిస్ట్రిక్టు బోర్డు మెంబరుగ నిదివరలో నాఱుసంవత్సరము లుండి యిప్పుడు తిరిగి యాపదవి నలంకరించిరి. పదునైదువత్సరముల నుండి ఆనరరీ మేజస్ట్రీటుగఁ గూడ నుండిరి.



ఏలూరులో జరిగిన సప్తమార్యవైశ్య మహాజనసభ కాహ్వానసంఘాధ్యక్షులుగ నుండి మిక్కిలి దీక్షతో కార్యభారము నిర్వహించిరి.

నారాయణరావుగారు తరుణవయస్కు లయ్యుఁ గీర్తికరములైన కార్యములకుఁ దోడ్పడుచు నేలూరు హిందూయువజనసంఘమునకు వైసుప్రెసిడెంటుగ నుండి సంఘముకొఱకు మిగులఁ బాటుపడుచుండిరి. మఱియు వీరు హూణభాషాలంకృతులై యొకసారి పాశ్చాత్యదేశమునకును వెళ్లి వచ్చిరి.

ఈ మోతేకుటుంబమువారి విధంబున నెల్లకాలమును నవిభక్తకుటుంబీకులుగ నుండి పరస్పరైకమత్యంబును విడనాడక సర్వజనానురంజనముగ వర్ధిల్లునట్లు సర్వేశ్వరుండగు, శ్రీమన్నారాయణమూర్తి కరుణించుఁ గాత.